సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం । 29 । ఏప్రిల్ । 2023



పీహెచ్‌సీల్లో మరిన్ని వైద్యపరీక్షలు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రభుత్వాస్పత్రులకు ఆధునిక పరికరాలు సమకూర్చుతోంది. మెరుగైన వైద్యసేవలు అందిస్తోంది.

- IIలో



ప్రపంచ పోటీలకు వెళ్లేందుకు సహకరించండి

సౌత్‌ఆఫ్రికాలో జరగనున్న 5వ ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సహకారం అందించాలని క్రీడాకారిణి రెడ్డి మౌనిక ఎంపీకి విజ్ఞప్తిచేసింది.

- IIలో

భలే హెల్మెట్



రాజాం: వేసవి ఎండలతో జనం అల్లాడిపోతున్నారు. తలకు రక్షణ లేకుండా ప్రయాణం చేయడం గగనంగా మారింది. ఈ తరుణంలో రాజాం పట్టణం డోలపేట సమీపంలోని ఓ చిన్నారి సైకిల్‌పై ప్రయాణిస్తూ తలకు వాటర్ మిలన్‌ను హెల్మెట్‌లా అమర్చుకుంది. ఈ దృశ్యాన్ని చూసి పలువురు చిన్నారి తెలివిని అభినందించారు.

న్యూస్‌రీల్

నేడు సాలూరులో బైక్ ర్యాలీ

సాలూరు: జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయిన నేపథ్యంలో సాలూరులో శనివారం నిర్వహించే బైక్ ర్యాలీలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొనాలని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర కార్యాలయ వర్గాలు పిలుపునిచ్చాయి. ఉదయం 10 గంటలకు సాలూరు పట్టణంలోని ఫిలదెల్ఫియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న కమ్యూనిటీ హాల్ వద్ద సమావేశం జరుగుతుందని పేర్కొన్నాయి. అనంతరం అక్కడ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపాయి.

రెచ్చిపోయిన ఏనుగులు

- 30 బస్తాల మొక్కజొన్న గింజలు ధ్వంసం



ఏనుగులు ధ్వంసం చేసిన మొక్కజొన్న గింజలను పరిశీలిస్తున్న రైతులు

భామిని: మండలంలోని తాలాడ ఐలమ్మ తోటలో తిష్టవేసిన నాలుగు ఏనుగుల గుంపు గురువారం అర్ధరాత్రి తర్వాత రెచ్చిపోయాయి. కోసలికి చెందిన మజ్జి రామారావు, మజ్జి రవి విక్రయానికి సిద్ధం చేసిన సుమారు 30 బస్తాల మొక్కజొన్న గింజలను ధ్వంసం చేశాయి. కొంత మేర తినేసి, చెల్లాచెదురుగా విసిరేశాయి. సుమారు రూ.60 వేలు నష్టం కలిగించినట్టు సర్పంచ్ మజ్జి మోహనబాబు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫూల్‌బాగ్: టెక్నికల్ సర్టిఫికెట్ 42 రోజుల సమ్మర్ ట్రైనింగ్ కోర్స్–2023లో చేరేందుక దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి మే 6వ తేదీలోగా www.bre.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదవ తరగతి లేదా తత్సమాన పరీక్షతో పాటు టీసీసీ లోయర్‌గ్రేడ్ పాసైన వారు అర్హులని పేర్కొన్నారు.

మరో రెండు రోజులే గడువు

- ఈ నెల 30లోగా ఆస్తి పన్ను చెల్లించే వారికే ఐదు శాతం రాయితీ వర్తింపు
- ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ఏడు పట్టణాల్లో పథకం అమలు
- ఇప్పటి వరకు రూ.9.52 కోట్లు వసూలు
- శని, ఆదివారాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు



విజయనగరంలోని భవన సముదాయాలు

విజయనగరం: ప్రతీ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో (ఏప్రిల్ నెలలో) పట్టణాల్లోని ఆస్తి, ఖాళీ స్థలాలపై ముందుస్తుగా పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ సదుపాయం కల్పిస్తోంది. రాయితీ గడువు ఈనెల 30తో ముగియనుంది. మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని, పన్ను చెల్లించి రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని భవన, ఖాళీ స్థలాల యజమానులకు అధికారులు కోరుతున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ఏడు పట్టణాల్లో ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం ఐదుశాతం రాయితీని వర్తింపజేస్తోంది. విజయనగరం జిల్లాకు సంబంధించి విజయనగరం కార్పొరేషన్, బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల, రాజాం నగర పంచాయతీలు ఉండగా... పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు, పార్వతీపురం మున్సిపాలిటీలు, పాలకొండ నగర పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తంగా 1,23,504 అసెస్‌మెంట్‌లు ఉన్నట్టు అధికారిక లెక్కలు వెల్లడిస్తుండగా.. వాటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.59.77 కోట్లు ఆస్తి పన్ను రూపంలో వసూలు కావాల్సి ఉంది.

ముందుకొస్తున్న పన్ను చెల్లింపుదారులు

ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం ఇచ్చే 5 శాతం రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు పన్ను చెల్లింపుదారులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటివరకు రూ.9.52 కోట్ల మేర పన్ను చెల్లించి రాయితీ పొందారు. పథకం ముగిసేందుకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండగా... పన్నుల చెల్లింపుపై భవన యజమానులకు మున్సిపల్ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

వార్డు సచివాలయ కార్యదర్శులతో విస్తృత ప్రచారం చేస్తున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో పన్ను బకాయిల వసూళ్లలో అధికార యంత్రాంగం సఫలీకృతమైంది. అదే స్ఫూర్తితో ఏప్రిల్ నెలాఖరు నాటికి గతేడాది కంటే ఎక్కువ మంది రాయితీని సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించింది. ఈనెల 30వ తేదీ ఆదివారం కావడంతో ఆ రోజు కూడా ఆయా కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి పన్ను చెల్లింపుదారులకు సేవలందిస్తామని అధికారులు ప్రకటించారు.

శని, ఆదివారాల్లో ప్రత్యేక కౌంటర్లు



2023–24 ఆర్థిక సంవత్సరానికి ముందస్తు పన్ను చెల్లింపుపై ఐదు శాతం రిబేట్ సౌకర్యానికి మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. ఆస్తి, ఖాళీ స్థలముల పన్నులపై ఐదుశాతం రిబేట్ సౌకర్యంతో ఈనెల 30వ తేదీలోగా చెల్లించవచ్చు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం శని, ఆదివారాల్లో కూడా కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని సచివాలయాల్లోనూ పన్ను చెల్లింపులకు అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందస్తు పన్ను చెల్లింపులు చేసి ఐదు శాతం రిబేట్ సౌకర్యం పొందాలని కోరుతున్నాం.

– రెడ్డి శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆస్తిపన్ను డిమాండ్, వసూలు వివరాలు ఇలా..			
ప్రాంతం	అసెస్‌మెంట్‌ల సంఖ్య	డిమాండ్	వసూలైన మొత్తం
విజయనగరం	63,105	రూ.43.49కోట్లు	రూ.5.60 కోట్లు
బొబ్బిలి	11,979	రూ.4.22 కోట్లు	రూ.0.63 లక్షలు
రాజాం	11,622	రూ.2.55 కోట్లు	రూ.0.35 లక్షలు
నెల్లిమర్ల	5,208	రూ.1.25 కోట్లు	రూ.0.27 లక్షలు
పార్వతీపురం	12,735	రూ.4.05 కోట్లు	రూ.1.10 కోట్లు
సాలూరు	11,532	రూ.2.32 కోట్లు	రూ. 0.25 లక్షలు
పాలకొండ	7,323	రూ.1.87 కోట్లు	రూ. 0.46 లక్షలు

పన్నుల వసూలులో పార్వతీపురం ఫస్ట్

ఐదు శాతం రాయితీపై ఆస్తి పన్ను వసూలులో అధికారిక లెక్కల ప్రకారం పార్వతీపు మున్సిపాలిటీ ఉమ్మడి విజయనగరం జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. రెండవ స్థానంలో పాలకొండ నిలవగా.. మూడవ స్థానంలో నెల్లిమర్ల నగర పంచాయతీ ఉంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నెల ముగిసే సమయానికి రూ.7 కోట్లు మొత్తాన్ని వసూలు చేయగా... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.5.60 కోట్లు వసూలు చేయగలిగారు. మరో రెండు రోజులు గడువు ఉండడంతో గత ఏడాది కంటే ఎక్కువ మొత్తంలో పన్నులు వసూలవుతుందని అధికారులు ఆశిస్తున్నారు.

ఆదాయముంటేనే అభివృద్ధి

పట్టణాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు, పారిశుధ్యసేవలు అందించేందుకు, విద్యుత్ బిల్లుల చెల్లింపునకు, కార్మికులకు వేతనాలు అందించేందుకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయం కీలకం. మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం పన్నుల వసూలుపై దృష్టి సారించింది.

సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారు

- వచ్చేనెల 3న భోగాపురం రానున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షిప్రతినిధి, విజయనగరం: భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 3వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. చింతపల్లి ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం, తారక రామతీర్థ సాగర్ ప్రాజెక్టు మిగులు పనులకు సైతం ఆదే రోజు శ్రీకారం చుడతారు. ఈ మేరకు ఆయన పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఆ వివరాలు ఇలా..

ఉదయం 8 గంటలు: తాడేపల్లిలోని నివాసం నుంచి విజయవాడ గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరుతారు.

8:20కు: గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.

8:30కు: గన్నవరం విమానాశ్రయం నుంచి విశాఖ విమానాశ్రయానికి ప్రయాణమవుతారు.

9:20కు: విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు.

9:30కు: విశాఖ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో భోగాపురం బయల్దేరుతారు.

10 గంటలకు: భోగాపురం మండలం ఎ.రావివలస గ్రామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.

10:05 గంటలకు: జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వాగతం పలుకుతారు.

10:15కు: ఎ.రావివలస హెలి ప్యాడ్ నుంచి జీఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు బయలుదేరుతారు.

10:25కు: జీఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు చేరుకుంటారు. ఆ సెంటర్‌ను సందర్శిస్తారు. భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి శంకుస్థాపన చేస్తారు.

10:30కు: భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణం, చింతపల్లి ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం, తారక రామతీర్థ సాగర్ ప్రాజెక్టు మిగులు పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు.

10:55కు: సవరవిల్లి వద్ద బహిరంగసభ వేదిక వద్దకు చేరుకుంటారు.

మధ్యాహ్నం 12.30 గంటలకు: బహిరంగ సభ ముగిసిన తర్వాత ఎ.రావివలస హెలిప్యాడ్‌కు బయల్దేరుతారు.

12:35కు: స్థానిక ప్రజాప్రతినిధులతో సీఎం ముచ్చటిస్తారు.

1:20 గంటలకు: విశాఖలో పర్యటనకు బయల్దేరి వెళ్తారు.



ముఖ్యమంత్రి సభా స్థలంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ

సభాస్థలి పరిశీలన

భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి మే 3వ తేదీన శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న నేపథ్యంలో హెలిప్యాడ్, బహిరంగ సభ స్థలంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సభావేదిక, పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై వివిధ శాఖల అధికారులతో చర్చించి జరుగుతున్న పనులపై ఆరా తీశారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలు వీఐపీలు, అతిథులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ దీపికపాటిల్, ఆర్డీఓ సూర్యకళ, డీపీఓ శ్రీధర్‌రాజా, కాకర్లపూడి శ్రీనివాసరాజు, ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, శివారెడ్డి, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, సీఐ కేవీవీ విజయనాథ్, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో మరిన్ని వైద్యపరీక్షలు

- అందుబాటులోకి అధునాతన పరికరాలు
- రోగులకు 63 రకాల పరీక్షలు చేయనున్న వైద్యాధికారులు
- శిక్షణ పొందిన ల్యాబ్‌టెక్నీషియన్లు


తారాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు


రామభద్రపురం పీహెచ్‌సీలో పరీక్షలు చేసే మెషిన్లను చూపిస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్ ఆనంద్

రామభద్రపురం: ప్రతి వ్యక్తికి మెరుగైన ఉచిత ఆరోగ్య సంరక్షణ కోసం నాడు–నేడు పేరుతో ఆస్పత్రుల రూపురేఖలను మార్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో రోగులకు మరిన్ని వైద్యపరీక్షలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందుకోసం వైద్యారోగ్యశాఖ అధునాతన యంత్ర పరికరాలను పీహెచ్‌సీలు, యూహెచ్‌సీలకు అందజేసింది.జిల్లాలో 50 పీహెచ్‌సీలు,18 యూహెచ్‌సీలు ఉన్నాయి. వాటికి ఒక్కోదానికి సీబీసీ, ఎలక్ట్రొలైట్ ఎనలైజర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ ఎనలైజర్, టీబీ ఆర్టీపీఆర్ వంటి అధునాతన యంత్ర పరికరాలను సమకూర్చింది. ఇప్పటి వరకూ వాటిలో కేవలం 15 నుంచి 20 రకాల వైద్య పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు కొత్తగా చేరిన పరీక్షలతో కలిపి వాటి సంఖ్య 63కు పెరగనుంది. వైద్య పరీక్షల నిర్వహణ కోసం ప్రతి పీహెచ్‌సీ, యూహెచ్‌సీలలో ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించారు.ఇప్పటికే వారికి అధునాతన యంత్ర పరికరాల నిర్వహణపై శిక్షణ కూడా ఇచ్చారు.

పేద రోగులకు ఎంతో మేలు

గతంలో పీహెచ్‌సీలలో చాలా రకాల వైద్య పరీక్షలు లేకపోవడంతో వాటి కోసం రోగులు సమీప ఏరియా ఆస్పత్రి, జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి లేదా ప్రైవేట్ అసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇది పేద కుటుంబాలకు చెందిన రోగులకు ఆర్థిక భారం అయ్యేది. రోగితో పాటు వెళ్లిన వారు అదనంగా శ్రమ పడాల్సి వచ్చేది. దీనివల్ల రోగ నిర్ధారణకు ఎక్కువ సమయం పట్టేది. అప్పటి వరకు రోగికి కచ్చితమైన వైద్యం అందేది కాదు. ప్రస్తుతం అదనపు వైద్య పరీక్షలు పీహెచ్‌సీలలోనే అందుబాటులోకి రావడంతో కొన్ని గంటల వ్యవధిలోనే రోగుల వ్యాధి నిర్ధారణ వీలవుతోంది. ఫలితంగా ఇబ్బంది ఉన్న రోగికి వెంటనే మెరుగైన వైద్యసేవలు అందించడానికి అవకాశం కలుగుతోందని వైద్యాధికారులు చెబుతున్నారు.

పీహెచ్‌సీలో చేసే వైద్య పరీక్షలు

సీఆర్‌పీ, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, యూఆర్‌ఈఏతో పాటు హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్, కౌంట్, సీబీసీ, టోటల్ బ్లడ్ సెల్‌కౌంట్, ర్యాండమ్ బ్లడ్ సుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, హెచ్‌ఐవీ, హెపటైటిస్–బి, డెంగీ, బ్లీడింగ్, క్లాటింగ్ టైమ్, థైరాయిడ్,పొటాషియం, క్లోరైడ్ తదితర 63 రకాల పరీక్షలు చేయనున్నారు. వైద్యపరీక్షలపై గ్రామాలలో రోగులు, ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లకు వైద్యాధికారులు సూచిస్తున్నారు.

పీహెచ్‌సీలకు చేరిన పరికరాలు



రోగులకు వివిధ రకాల వైద్యపరీక్షలు చేయడానికి అవసరమైన అధునాతన యంత్ర పరికరాలు, మెషినరీ ఇప్పటికే పీహెచ్‌సీలకు చేరాయి. వైద్య పరీక్షలు ఎలా చేయాలో ప్రాథమికంగా ల్యాబ్‌టెక్నీషియన్లకు శిక్షణ కూడా ఇచ్చాం. సేవల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నాం.త్వరలోనే పీహెచ్‌సీ, యూహెచ్‌సీలలో పేదలకు అన్ని రకాల పరీక్షలు ఉచితంగా అందుబాటులోకి రానున్నాయి. **ఎస్‌వీ రమణకుమారి, జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి**

ఈ నెలలో సేవలు ప్రారంభం



ఈ నెలలో 63 రకాల వైద్యపరీక్షలు రోగులకు అందుబాటులోకి వస్తాయి. ఇక పరీక్షల కోసం పట్టణ ప్రాంతాలకు, ప్రైవేట్ ఆస్పత్రులకు పేద రోగులు వెళ్లాల్సిన అవసరం లేదు.త్వరగా రోగ నిర్ధారణ అవుతుంది.వెంటనే అవసరమైన వైద్యం అందిస్తాం. **ఏఎల్‌జి శిరీష, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, రామభద్రపురం**

అక్రిడేషన్ల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ

- కలెక్టర్ నాగలక్ష్మి ఎస్


కలెక్టర్ నాగలక్ష్మి ఎస్

విజయనగరం అర్బన్: 2023–24 కాలపరిమితికి గాను జారీ చేయనున్న జర్నలిస్టుల అక్రిడిటేషన్లకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైందని జిల్లాలోని సంబంధిత ప్రాత్రికేయులు దరఖాస్తు సమర్పించుకునేందుకు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 38లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన ఆయా పత్రికలు, టీవీలు, న్యూస్ ఏజెన్సీలకు చెందిన ప్రతినిధులు, వెటరన్, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు ఈ నెల 28వ తేదీ నుంచి మే నెల 15వ తేదీలోగా 'ఐపీఆర్.ఏపీ.జీఓవి.ఐఎన్' అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. సదరు జీవో మేరకు జర్నలిస్టులు వారి వివరాలతోపాటు యాజమాన్యాల సిఫారసు లేఖ, అవసరమైన డాక్యుమెంట్లు పీడీఎఫ్ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, దరఖాస్తుదారు సంతకం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ అనంతరం సంబంధిత అప్లికేషన్ ప్రింట్ తీసి, దానితో పాటు అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్‌లు, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి, విజయనగరం కార్యాలయంలో మే నెల 16వ తేదీలోగా అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

వెబ్‌సైట్‌లో పేర్లు యాడ్ చేయించుకోవాలంటే..

ఆయా పత్రికలు, టీవీల పేర్లు వెబ్‌సైట్‌లో యాడ్ చేయించుకేందుకు జీఓ నంబర్ 38లో పేర్కొన్న విధంగా టీవీ సంస్థలైతే తాజా వార్షిక పన్ను చెల్లింపు పత్రాలు, ఐబీ లైసెన్స్, పత్రికలైతే ఆర్‌ఎన్‌ఐ సర్టిఫికెట్, ఆర్‌ఎన్‌ఐకు సమర్పించిన తాజా వార్షిక పన్ను చెల్లింపు నకలు కాపీ, పేజీల సంఖ్య, సర్క్యులేషన్ వివరాలతో కూడిన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కేబుల్ టీవీలకు సంబంధించి కేబుల్ టీవీ యాక్ట్ 1995 నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ సమర్పించాలని పేర్కొన్నారు.

హోటల్స్ ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పార్వతీపురం: హోటళ్లు ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్స్, లాడ్జిలు, రెస్టారెంట్లు, వెల్‌నెస్ సెంటర్లు, ట్రావెల్ ఆపరేటర్లు, ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికెట్‌తో పాటు, కేంద్ర ప్రభుత్వం సాథి–నిధి అందజేస్తుందని, ఈ సర్టిఫికెట్ పొందిన వారికి పర్యాటక ప్రయోజనాలు చేకూరతాయన్నారు. హోటల్స్, రెస్టారెంట్లు, లాడ్జిలు, గెస్ట్ హౌస్‌లకు రూ.300, హోం స్టేలు, ఫాం స్టేలకు రూ.200, టూర్ బోటు ఆపరేటర్లు, అడ్వెంచర్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్ ఆపరేటర్లకు రూ.500లు, వెల్‌నెస్ సెంటర్లు, కన్వెన్షన్ హాలు, సర్వీసు అపార్ట్‌మెంట్లకు రూ. 500లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వివరించారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటూరిజం.జీఓవీ.ఇన్‌వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు జిల్లా పర్యాటక అధికారి ఫోన్ 6309942083, 8919168306 నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

- టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు


వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సిఐ సిహెచ్. లక్ష్మణరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కుని పరారైన ఇద్దరు నిందితులను టూటౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ సిహెచ్.లక్ష్మణరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కోట సత్యవతి ఈ నెల 26న శివాలయంలో పూజలు నిర్వహించి తిరిగి ఇంటికి నడుచుకుని వెళ్తుండగా రాజీవ్‌నగర్ కాలనీ వద్ద గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో ఒకటిన్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కుని పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నించిన స్థానికులు మోటార్ బైక్ నెంబర్‌ను పోలీసులకు అందించారు. దీంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శుక్రవారం దాసన్నపేట వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మోటార్ సైకిల్ నంబర్‌ను గుర్తించారు. గుర్ల మండలం చింతలపేటకు చెందిన గరుగుబిల్లి పవన్‌కుమార్, యడ్ల శివలను పట్టుకుని విచారణ చేశారు. వారి నుంచి తులంన్నర బంగారు పుస్తెల తాడు, మోటార్ సైకిల్‌ను రికవరీ చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించడంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఏఎస్సై పైడితల్లి, హెచ్‌సీ టీవీఆర్‌కే ప్రసాద్, కానిస్టేబుల్ వాసులను సీఐ అభినందించారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి


బొండపల్లి: రాములమ్మ మృతదేహం


బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లిలో రైల్వే ట్రాక్ దాటుతుండగా విజయనగరం నుంచి రాయగడ వైపు వెళ్తున్న తిరుపతి –బిలాస్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో ఓ వృద్ధురాలు అక్కడిక్కడే మృతి చెందింది. శుక్రవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎన్ని రాములమ్మ(70) గ్రామ సమీపంలో గల ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని సుమారు కిలోమీటర్ వరకు ఆమెను ఈడ్చుకుని వెళ్లిపోయింది. ట్రాక్ మొత్తం ఆమె శరీర భాగాలు చెదురుగా పడడంతో భయానక వాతావరణం నెలకొంది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలతో పాటు, కుమారుడు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య


మృతి చెందిన లక్ష్మునాయుడు


పార్వతీపురం: గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామానికి చెందిన కుడమల లక్ష్మునాయుడు(70) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పార్వతీపురం అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెండు నెలలనుంచి అనారోగ్యం కారణంగా ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో తీవ్రమనస్తాపానికి గురైన లక్ష్మునాయుడు ఇంట్లో ఉన్న గడ్డిమందును వేకువజామున తాగేశాడు. విషయం తెలుసుకున్న కుమారుడు గౌరునాయుడు చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్న పెద్దచెరువు గట్టు సమీపంలో సుమారు 60 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. డయల్ 100కి వచ్చిన కాల్ ఆధారంగా అక్కడికి వెళ్లి పరిశీలించి వివరాలు సేకరించామన్నారు. కొద్దిరోజులుగా యాచక వృత్తి చేస్తూ అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, బంధువులు ఎవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలని కోరారు.

పక్కాగా సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే


అలుగోలు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల రూరల్: పక్కాగా సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే చేయాలని ఎంపీడీఓ గిరిబాల సూచించారు. శుక్రవారం మండలంలోని అలుగోలు, గుషిణి గ్రామ సచివాలయాలను సందర్శించిన ఆమె రికార్డుల నిర్వహణ, ఉద్యోగుల పనితీరు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వలంటీర్ల సమన్వయంతో సిబ్బంది త్వరితగతిన సిటిజన్ ఔట్ రీచ్ సర్వే పూర్తి చేయాలన్నారు.

ఉపాధి కోర్సుల్లో మహిళలకు ఉచిత శిక్షణ

- వచ్చే నెల 5వ తేదీలోగా దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: నిరుద్యోగ యువకులకు ఉపాధి కలిగించే పలుకోర్సులకు ఉచిత శిక్షణ తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వసతి గృహంలో నిర్వహిస్తామని సంస్థ నిర్వాహకుడు బీవీ రమణ తెలిపారు. పురుషులకు హౌస్ వైరింగ్, మెన్స్ టైలరింగ్ అండ్ ఇన్‌స్టాలేషన్ ఆఫ్ సీసీటీవీ కెమెరా కోర్సులపై శిక్షణ ఉంటుందని తెలిపారు. 30 రోజులపాటు వసతి భోజన సౌకర్యాలను ఉచితంగా కల్పించే ఈ కోర్సులకు తెల్లకార్డుదారులు, 45 ఏళ్లలోపు ఉన్న గ్రామీణ ప్రాంత పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు వచ్చే నెల 10వ తేదీ లోపు దరఖాస్తులను కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తి వివరాల కోసం 9959521662, 9985787820 ఫోన్ నంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటనకు విస్తృత బందోబస్తు

- భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేసిన ఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక


హాజరైన అధికారులు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: జిల్లాలోని భోగాపురంలో నూతనంగా నిర్మించనున్న విమానాశ్రయానికి శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి మే 3న హాజరుకానున్న నేపథ్యంలో విస్తృత బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టనున్న బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ఇబ్బందులు తలెత్తకుండా అన్ని భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారికి దగ్గర హెలిప్యాడ్ మీటింగ్ స్థలం ఉన్నందున జాతీయ రహదారిపై వాహనాల రాక, పోకలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకుగాను ప్రత్యేకంగా ట్రాఫిక్ రెగ్యులైజేషన్, పార్కింగ్ స్థలాల వద్ద ప్రత్యేకంగా పోలీస్ సిబ్బందిని, అధికారులను నియమించడంతో పాటు, పర్యవేక్షించేందుకు ఉన్నతస్థాయి పోలీసు అధికారిని నియమించినట్లు చెప్పారు.

పటిష్టంగా బారికేడింగ్

ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొనేందుకు వచ్చే ముఖ్య వక్తుల వాహనాలకు, ప్రజలకు వేర్వేరుగా పార్కింగ్ స్థలాలు కేటాయించాలన్నారు. సభాస్థలి వద్ద బారికేడింగ్ పటిష్టంగా ఏర్పాటుచేసే విధంగా సంబంధిత ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో పోలీసు అధికారులు, పోలీసుసిబ్బంది నిర్వహించాల్సిన విధులను, చేపట్టాల్సిన భద్రతా చర్యలను సంబంధిత అధికారులకు ఎస్పీ వివరించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాల్సిన ప్రాంతాలను, సభాస్థలం, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను సంబంధిత అధికారులు ప్రత్యక్ష్యంగా సందర్శించాలని, నిర్వహించాల్సిన భద్రతా విధులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, సీఐలు విజయనాథ్, జి.రాంబాబు, ఇ.నరసింహమూర్తి, జె.మురళి, బి.వెంకటరావు, సీహెచ్.లక్ష్మణరావు, టీవీ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,040–00
బంగారం(22సి. 10గ్రా.)	55,950–00
వెండి (కిలో)	80,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

ప్రపంచ పోటీలకు వెళ్లేందుకు సహకరించండి

- ఎంపీ 'బెల్లాన'ను కోరిన టెన్నికాయిట్ క్రీడాకారిణి


టెన్నికాయిట్ క్రీడాకారిణి మౌనికను అభినందిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: సౌత్‌ఆఫ్రికాలో జరగనున్న 5వ ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సహకారం అందించాలని గరివిడి మండలంలోని కేఎల్ పురం గ్రామానికి చెందిన టెన్నికాయిట్ క్రీడాకారిణి రెడ్డి మౌనిక కోరింది. ఈ మేరకు శుక్రవారం ఆమె ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను ఆయన నివాసంలో కలిసింది. ఈ సందర్భంగా ఎంపీతో మాట్లాడుతూ 2023 సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 8 వరకు సౌత్‌ఆఫ్రికాలో 5వ ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ జరగనుందని, దీనికి సంబంధించి మే 10 నుంచి 23 వరకు చెన్నైలో ప్రాబబుల్స్‌కు శిక్షణ జరగనుందని స్పష్టం చేసింది. భారతదేశం నుంచి ప్రపంచ చాంపియన్‌షిప్‌కు వెళ్లేందుకు ప్రతి రాష్ట్రం నుంచి ఇద్దరు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేయగా అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక చేసిన ఇద్దరిలో తాను ఉన్నట్లు చెప్పింది. సౌత్ ఆఫ్రికా వెళ్లేందుకు రవాణా, వసతి సంబంధిత అవసరాల కోసం ఆర్థిక సహకారం అందించాలని కోరింది. దీనికి స్పందించిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మౌనికను అభినందించి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బెల్లాన వంశీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు పీసీ. స్వరూప్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ బాధిత కుటుంబాలకు న్యాయం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు


కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: రైల్వే 3వ లైన్ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు హామీ ఇచ్చారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలక సంఘం పరిధి 9వ వార్డులో గల విజయరామరాజు కాలనీలో శుక్రవారం ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప్పర వీధి ప్రాంతానికి చెందిన స్థానిక ప్రజల నివాసాలు రైల్వే మూడవ లైన్ అభివృద్ధి పనుల కోసం అవసరమైన భూ సేకరణలో భాగంగా ఇటీవల రైల్వే అధికారులు కొలతలు తీసుకున్నారని, సుమారు 75 గృహాలు నష్టపోయే పరిస్థితి ఎదురవడంతో ఆయా నివాసాల కుటుంబాలు ఆందోళన చెందుతున్న విషయాన్ని తెలుసుకున్నానని చెప్పారు. అందులో భాగంగా మీ ప్రాంతాన్ని సందర్శించి మిమ్మల్ని స్వయంగా సమస్యలు అడిగి తెలుసుకుంటున్నానన్నారు.

మమ్మల్ని ఆదుకోవాలి

ఎమ్మెల్యే స్వయానా తమ ప్రాంతానికి విచ్చేయడంతో స్థానిక ప్రజలు అంతా విచ్చేసి రైల్వే లైన్ పనుల్లో భాగంగా తమ నివాసాలు పోతే ఎక్కడ ఉండాలని, నిలువ నీడ లేదని మీరే ఆదుకోవాలని ప్రజలంతా ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. దీంతో వారి సమస్యల మీద వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా రెండు రోజుల్లోగా రైల్వే అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు సమచిత న్యాయం జరిగేలా తన వంతు ప్రయత్నం తప్పక చేస్తానని హామీ ఇచ్చారు. స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పి.జయంతి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, కో ఆప్షన్ సభ్యుడు మేరువ వెంకట్రావు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జొన్నకు కనీస 'మద్దతు' ఇవ్వాలి


- ట్రేడర్స్ సమావేశంలో జేసీ మయూర్ అశోక్


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: కనీస మద్దతు ధర తగ్గకుండా మొక్కజొన్న కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ట్రేడర్‌లు, విజయనగరం బయోటెక్ ప్రతినిధులతో మొక్కజొన్న ధర్‌పై నిర్వహించిన సమావేశంలో సూచించారు. రైతులు ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్నారని వారికి మంచి గిట్టుబాటు ధర కల్పించాలని స్పష్టం చేశారు. కనీస మద్దతు ధర క్వింటాకు రూ.1,962 ఉండగా ట్రేడర్స్ రూ.1,900 మాత్రమే చెల్లిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ట్రేడర్‌లకు కావలసిన గొడౌన్ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో మార్కెట్ యార్డ్ పరిధిలో గొడౌన్‌లు ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని సూచించారు. పలువురు ట్రేడర్స్ మాట్లాడుతూ 15 రోజుల క్రితం తాము రూ. 2,250కు కూడా క్వింటా కొన్న సందర్భాలు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి టీవీ రామారావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ విమల, విజయనగరం బయోటెక్ కొనుగోలు మేనేజర్ మురళి, పలువురు ట్రేడర్‌లు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ విగ్రహ ప్రతిష్ఠ


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


పూజలు చేస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, తదితరులు

డెంకాడ: మండలంలోని సింగవరంలో నూతనంగా నిర్మించిన బంగారమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి పూజలు చేశారు. వీరితో పాటు సర్పంచ్ పిట్టా పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మూడు రోజులుగా గ్రామస్తులు, భక్తులు వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన స్వీకరించారు.

రాధికారాణికి 'అభినేత్రి' పురస్కారం


సినీనటి మంజుభార్గవి చేతుల మీదుగా అభినేత్రి పురస్కారం అందుకుంటున్న డాక్టర్ భేరి రాధికారాణి

విజయనగరం టౌన్: నర్తనశాల కూచిపూడి డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ భేరి రాధికారాణికి సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో ఉన్న సిద్ధేంద్రయోగి కళాపీఠం 'అభినేత్రి' పురస్కారాన్ని గురువారం రాత్రి అందజేసింది. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కూచిపూడి కళాకారిణి, సినీనటి మంజుభార్గవి, అసోసియేషన్ అధ్యక్షురాలు భావన, పవన్‌ల చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు అభిమానులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు.